ప్రజాశక్తి

ఆదివారం 2 నవంబర్ 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

నిర్వహణ లేక... నిరుపయోగం

● చెత్త నుంచి సంపద తయారీపై నిర్లక్ష్యం ● అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన కేంద్రాలు



నందిగామలో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం



రోడ్డు వెంట పడేసిన చెత్త

ప్రజాశక్తి-నందిగామ

చెత్త నుంచి సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. చెత్త నుంచి సంపద సష్టించి పంచాయతీలకు ఆదాయం సమకూర్చడానికి గతంలో టీడీపీ ప్రభుత్వం సంపద కేంద్రాలు ఏర్పాటు చేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెత్త నుంచి సంపద కేంద్రాలను విస్మరించడంతో లక్షలు వెచ్చించి నిర్మించిన కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. నందిగామ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సంపద కేంద్రాల నిర్వహణపై ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఇంటింటి నుంచి చెత్త సేకరిస్తున్నా రహదారుల వెంట పోస్తుండటం వల్ల డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా ఎక్కడా వర్మీకంపోస్టు తయారీ ఊసేలేదు. ఐదు నెలల క్రితం హడావుడిగా ఈ ఎరువు తయారు చేయించినా ఆ తరువాత వీటి గురించి పట్టించుకోవడం లేదు. ఫలితంగా పలుచోట్ల ఈ కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారాయి.

నందిగామ నియోజకవర్గంలో సుమారు 80 సంపద కేంద్రాలు ఉన్నాయి. ప్రతి పంచాయతీకి ఒకటి చొప్పున గతంలో మంజూరు చేశారు. ప్రారంభంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హడావుడి చేసినా ఆ తరువాత వీటి నిర్వహణ గురించి పట్టించుకున్న దాఖలాలే లేవు. నందిగామ మండలం 23, చందర్లపాడు 18, కంచికచర్ల 20, వీరులపాడులో 20 కేంద్రాలు ఉండగా దాదాపు ఎక్కడా సరిగ్గా నిర్వహించడం లేదు. సంపద కేంద్రాలపై నిర్లక్ష్యం వల్ల వర్మీకంపోస్టు తయారీ కనిపించటం లేదు. ఉపాధి హామీ నిధులతో ఏర్పాటు చేసిన షెడ్లలో తడి చెత్త నుంచి వానపాముల ఎరువు తయారు చేయించాల్సి ఉన్నా ఈ ప్రక్రియ కొనసాగడం లేదు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు ఆటోలు, రిక్షాల ద్వారా ఇంటింటి నుంచి చెత్తను సేకరించి ఊరి చివర రహదారుల వెంట పోస్తున్నారు. కొందరు (మిగతా 2లో)



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

కార్తీక పౌర్ణమికి ఏర్పాట్లు కట్టుదిట్టం

● మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కార్తీక పౌర్ణమి సందర్భంగా సముద్రంలో స్నానమాచరించే యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ హాల్లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్‌తో కలిసి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ కార్తీక పౌర్ణమి రోజున ప్రతిఒక్కరూ సముద్రస్నానాలు ఆచరిస్తారన్నారు. అలాగే మచిలీపట్నంలో శ్రీ పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు కూడా మొదలయ్యాయన్నారు. పెద్ద ఎత్తున యాత్రికులు ఉత్సవాలకు, సముద్ర స్నానానికి వస్తారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు. గతేడాది సముద్ర స్నానాలకు లక్షకు పైగా యాత్రికులు వచ్చారని, ఈసారి అంతకుమించి వచ్చినా ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. యాత్రికులకు రాకపోకలకు అవసరమైనన్ని ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. మంగినపూడి బీచ్ వద్ద మంచినీరు, మరుగుదొడ్లు తదితర కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. చిన్నపిల్లలు తప్పిపోకుండా చేతికి ట్యాగులు వేయాలని, పాలు అందించేలా చూడాలని చెప్పారు. మంగినపూడిలో హారతి కార్యక్రమం నిర్వహణకు ప్రత్యేక ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ రాజా, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్యారేజీకి తగ్గిన వరద

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : విజయవాడ ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం తగ్గింది. గత రెండు రోజులుగా కృష్ణానదిలో 5.87 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. శనివారం రాత్రి ఎనిమిది గంటల సమయానికి బ్యారేజీ వద్ద ఇన్ఫ్లో, అవుట్ ఫ్లో 1,67,175 క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీ 70 గేట్లలో 40 గేట్లు నాలుగడుగులు, 29 గేట్లు మూడడుగుల మేర పైకి ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్లుగా సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ నీటి నిల్వ సామర్థ్యం 12 అడుగులు కొనసాగుతున్నట్లు తెలిపారు. కృష్ణా డెల్టా ప్రధాన కాలువలకు నీటిని నిలిపివేశారు. పులిచింతల నుంచి 1,12,966, పాలేరు11,456, మున్నేరు (కీసర) 5,092 క్యూసెక్కుల వరద బ్యారేజీకి చేరుతుంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఆలయాల్లో సదుపాయాల పరిశీలనకు కమిటీలు

మూడు రోజుల్లో నివేదికివ్వాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం

ప్రజాశక్తి-విజయవాడ:

దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిర్వహణలో ఉన్న దేవాలయాలతో పాటు ప్రైవేటు యాజమాన్యాల కింద ఉన్న దేవాలయాలు అన్నింటిలోని సదుపాయాలు పరిశీలించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. దేవాలయాల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై ఆర్డీవోలు, ఏసీపీలు, దేవాదాయ శాఖ అధికారులతో శనివారం జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, ఎస్సై, పంచాయతీరాజ్ ఎఇ, విద్యుత్ ఎఇ, ఈవో/దేవస్థానం ధర్మకర్త (ట్రస్టీ)/ఇన్స్పెక్టర్, అగ్నిమాపక శాఖ అధికారులతో (మిగతా 2లో)

బుడమేరు భయం ఇంకెంత కాలం?

● ముంపు శాశ్వత నివారణకు నిధులు కేటాయించాలి

● వెలగలేరు రెగ్యులేటర్ సందర్శించిన సిపిఎం బృందం



వెలగలేరు రెగ్యులేటర్ వద్ద పరిశీలిస్తున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి-విజయవాడ

బుడమేరు వరద ముంపు భయం ఇంకెంతకాలమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రచారార్భాటం ఆపి నిర్దిష్టమైన ముంపు నివారణా చర్యలకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. వెలగలేరు వద్ద ఉన్న బుడమేరు రెగ్యులేటర్‌ను సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి ఆంజనేయులు, కోట కళ్యాణ్ తదితర నేతలతో కలిసి బాబూరావు శనివారం సందర్శించారు. బుడమేరు డైవర్షన్ ఛానల్‌లో కొండపల్లి శాంతినగర్ వద్ద గత సంవత్సరం గండి పడిన ప్రాంతం వద్ద నిర్మించిన గోడను పరిశీలించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ బుడమేరు ముంపు శాశ్వత నివారణకు తక్షణమే నిధులు కేటాయించాలని, లేనట్లయితే కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బుడమేరు బాధితులకు భరోసా ఇవ్వాలని కోరారు. గత సంవత్సరం వరదల్లో అనేకచోట్ల కరకట్టలు దెబ్బతిన్నా, తాత్కాలిక మరమ్మత్తులు తప్ప శాశ్వత రక్షణ గోడల నిర్మాణం చేపట్టలేదన్నారు. వెలగలేరు రెగ్యులేటర్ వద్ద గత మూడు నెలల నుండి చిన్న రిపేర్లు, రంగులు వేసే పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని, ఇద్దరు, ముగ్గురు కార్మికులతో తాత్కాలిక పనులు మాత్రమే చేస్తున్నారని తెలిపారు. నేటికీ ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టలేదన్నారు. 2024లో వచ్చిన వరదలతో అనేకమంది మృతిచెందారని, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని, వేల కోట్ల ఆస్తి నష్టం జరిగిందని గుర్తు చేశారు. మళ్లీ బుడమేరు ముంపు ప్రమాదం లేకుండా శాశ్వత చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి ఆనాడు ప్రకటించారని, 13 నెలలు గడిచిపోయినా, తక్షణ చర్యలకు రూ.7 వేల కోట్ల సహాయం చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరినా, నేటికీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నయా పైసా విడుదల చేయలేదని మండిపడ్డారు. శాంతినగర్ వద్ద గండి పడిన చోట 400 మీటర్ల గోడ కట్టారు మినహా ఇంకా ఎటువంటి పనులు జరగలేదని చెప్పారు. వెలగలేరు ఎగువున మరికొన్ని రిజర్వాయర్లు నిర్మించాలని, విజయవాడ తదితర ప్రాంతాలకు వరద ముంపు లేకుండా సమాంతర కాలువ తవ్వాలని, కృష్ణా నదిలో కలిసే డైవర్షన్ ఛానల్ లోతు, వెడల్పు పెంచాలని, కృష్ణానది తరహాలో బుడమేరు రక్షణ గోడలు నిర్మించాలని ఇంకా ఎన్నో ప్రతిపాదనలను ప్రముఖ ఇంజినీర్లు, ఇతర అధికారులు చేశారని, ఈ కూటమి ప్రభుత్వం వాటిని గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ మాట్లాడుతూ బుడమేరు ముంపు శాశ్వత నివారణా చర్యలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. అనేకచోట్ల పడిన గండ్లు పగడ్బందీగా పూడ్చలేదన్నారు. విజయవాడకు దిగువున కొల్లేరు వరకు అనేక చర్యలు చేపట్టాలని, ఎనికేపాడు వద్ద అండర్ టన్నెల్ వెడల్పు చేస్తామని ప్రకటన తప్ప పనులు చేయలేదన్నారు. శాశ్వత చర్యలపై ముఖ్యమంత్రి ఇటీవల కాలంలో ఒక్క సమీక్షా సమావేశం (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

కార్తీక పౌర్ణమికి ఏర్పాట్లు కట్టుదిట్టం

కూడిన కమిటీ మండలాల్లోని అన్ని దేవాలయాలను పరిశీలించాలన్నారు. క్యూలైన్లు, మరుగుదొడ్లు, ప్రసాద విక్రయ కేంద్రాలు, తాగునీరు, పార్కింగ్, సీసీటీవీలు, సైన్ బోర్డులు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేసి నివేదిక సమర్పించాలన్నారు. గతంలో ఆ దేవాలయానికి వచ్చిన యాత్రికుల సంఖ్య, యాత్రికుల తాకిడి అధికంగా ఉండే ప్రత్యేక రోజులు, పర్వదినాల వివరాలను తెలియజేయాలన్నారు. ప్రతి దేవాలయంలోనూ అత్యవసర మార్గం ఏర్పాటు చేయాలని, ఎమర్జెన్సీ నెంబర్ తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేవాలయంలోనూ, సమీపాన ప్రమాదానికి కారణమయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రమాద నివారణకు తగు సూచనలు చేయాలని చెప్పారు. మూడు రోజుల్లో కమిటీలు నివేదిక సమర్పించాలని, కార్తీక పౌర్ణమి, కార్తీక సోమవారాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కార్తీక పౌర్ణమి రోజున జరిగే జ్వాలాతోరణం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.షణ్ముఖం, డిసిపి సరిత పాల్గొన్నారు.

బుడమేరు భయం ఇంకెంత కాలం?

కూడా నిర్వహించలేదన్నారు. ఇరిగేషన్ శాఖ నిర్దిష్ట కేటాయింపులు చేయలేదన్నారు. విజయవాడ, ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల కూటమి ప్రజా ప్రతినిధులు బుడమేరు శాశ్వత చర్యలపై నోరు మెదపడం కానీ, ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంకానీ చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మహేష్, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లేక... నిరుపయోగం

సంపద కేంద్రాల బయట గుట్టగా పోయిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను విక్రయించి వచ్చిన ఆదాయం పంచాయతీలకు జమ చేయాలి. కానీ ఎక్కడా జరగడం లేదు. చందాపురం, లింగాలపాడు, మాగల్లు, రాఘవాపురం, రామిరెడ్డిపల్లి, పల్లగిరి తదితర పంచాయతీల్లో సంపద కేంద్రాలు వినియోగంలో లేవు. సంపద తయారీ కేంద్రాల నిర్వహణ ఆయా పంచాయతీలకు భారంగా మారింది. ఒక్కో పంచాయతీలో పారి శుధ్య కార్మికులు ఇద్దరు ఉంటున్నారు. వీరికి నెలకు రూ.6 వేలు వేతనాలు ఇస్తున్నారు. సంపద తయారీ కేంద్రాల్లో ప్రత్యేకించి కార్మికులను ఏర్పాటు చేసి నిత్యం పొడి, తడి చెత్తను విభజించాలి. తడి చెత్తతో ఎరువు తయారు చేసేలా నిత్యం పర్యవేక్షించాలి. కార్మికులను ఏర్పాటు చేసి ఈ పనులు చేయించడానికి పంచాయతీలకు భారంగా మారింది.

గాడిలో పెడతాం: ప్రసాదరావు, ఎంపీడీవో

సంపద తయారీ కేంద్రాలను గాడిలో పెడతాం. వీటి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయించాల్సి ఉంది. ఆవరణలో మొక్కలు నాటిస్తాం. తడి, పొడి చెత్త విభజన చేయించి వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేయిస్తాం.

నేడు స్టేడియంలో ఫ్యాన్ పార్క్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటి సారిగా మహిళ క్రికెట్ మ్యాచ్ కోసం ఫ్యాన్ పార్క్ ను విజయవాడలో ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఏసీఏ ప్రెసిడెంట్ కేశినేని శివనాథ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ 2025 లో ఆదివారం నవీ ముంబై వేదికగా జరిగే ఫైనల్ మ్యాచ్ ను వీక్షించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ స్టేడియంలో ఫ్యాన్స్ పార్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మహిళా క్రికెట్ ను ప్రోత్సహించే విధంగా ఫ్యాన్ పార్క్ విజయవాడలో పెడుతున్నట్లు తెలిపారు.

ఎఐపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్ సంగ్, ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2025లో 'అందరికీ ఏఐ' అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంస్థ హెడ్ రాకేష్‌కుమార్ తెలిపారు. నగరంలోని శాంసంగ్ స్టోర్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఎఐ ద్వారా ప్రజలు ఎలా జీవిస్తారు, కనెక్ట్ అవుతారు, ఆవిష్కరణలు ఎలా చేస్తారో ఈ కార్యక్రమం ద్వారా తెలియచేసినట్లు తెలిపారు.

చెస్‌లో ఎస్ఆర్ఆర్ అకాడమీ ప్రతిభ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: అక్టోబర్ 16, 17 తేదీల్లో కర్నూల్లో జరిగిన ఇంటర్నేషనల్ రాపిడ్ రేటింగ్ టోర్నమెంట్లో ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ విద్యార్థులు చెరుకూరి శౌర్య , ఇ .సృష్టి అంతర్జాతీయ రాపిడ్ రేటింగ్ సాధించారనీ అకాడమీ డైరెక్టర్ పి.రేణుక తెలిపారు. చెరుకూరి శౌర్య విజయవాడ రవీంద్ర భారతి స్కూల్లో ఎనిమిదవ తరగతి చదువుతున్నారనీ,. 1430 ఎల్లో రైటింగ్ సాధించాడని తెలిపారు. ఎర్రబోతు సృష్టి నారాయణ స్కూల్లో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడని, 1532 ఎల్లో రైటింగ్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.ఆర్.ఆర్. చెస్ కోచింగ్ అకాడమీలో జరిగిన అభినందన సభలో అకాడమీ డైరెక్టర్ పి.రేణుక రేటింగ్ సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: క్రెడాయి విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో జనవరి 9 నుండి నగరంలో ప్రాపర్టీ షో నిర్వహించనున్నట్లు చాప్టర్ చైర్మన్ ఎస్.సతీష్ బాబు తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ప్రాపర్టీ షో కు సంబంధించిన బ్రౌచర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏమట్లాడుతూ విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సారి 11 వ ప్రాపర్టీ షో విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. రియల్ ఎస్టేట్ సంస్థలు, బ్యాంకులు, వివిధ భవన్ నిర్మాణ సామాగ్రి సంస్థ స్టాల్ ఏర్పాటి చేస్తామని అన్నారు. కొత్తగా ఇల్లు కొనుకోవాలనుకునే వారి కోసం ఎవరిని సంప్రదించాలి అనే దానిపై అవగాహన కూడా కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు చాప్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



విలేఖర్ల తో మాట్లాడుతున్న 'ఎదవ' చిత్ర యూనిట్ సభ్యులు

బందరులో చిత్రయూనిట్ సందడి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకుని, నగరానికి చెందిన 14 మంది కొత్తవారిని పరిచయం చేస్తూ ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నూతన చిత్రం 'ఇట్లు మీ ఎదవ' చిత్రాన్ని విజయవంతం చేయాలని దర్శకుడు, కథానాయకుడు కటారి త్రినాథ్ విజ్ఞప్తి చేశారు. శనివారం వల్లూరి రాజా సెంటర్ సిరి కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఈ సినిమాకు ఆర్పి పట్నాయక్ సంగీతం సమకూర్చా రన్నారు. తండ్రి, కూతురు మధ్య ఉన్న ప్రేమ కథాంశంగా కొనసాగుతుందన్నారు. ఈ సినిమా కామెడీ, ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ తో ప్రేక్షకులను అలరిస్తుం దన్నారు. పక్కింటి తెలుగు అమ్మాయిగా సాహితీ అవాంఛ చక్కటి నటనను కనపరిచిందన్నారు. ఈ సినిమాలో మచిలీపట్నంకు చెందిన 14 మంది కొత్తవారికి అవకాశాన్ని ఇచ్చి ప్రోత్సహించామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బళ్లారి శంకర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మల్లి, లైవ్ ప్రొడ్యూసర్ బందావన్ కేతిరెడ్డి, డి ఓ బి జగదీష్ చీకటి, ఎడిటర్ ఉద్ధవ్ పాల్గొన్నారు.

గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం : జెసి



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : గిరిజన స్వాతంత్ర సమరయోధుల త్యాగాలు చిరస్మరణీ యమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ అన్నారు. జన జాతీయ గౌరవ దివస్ ఉత్సవాలలో భాగంగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు శనివారం వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన జాయింట్ కలెక్టర్ నవీన్ మాట్లాడుతూ మహనీయుల ఆశయ స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ గిరిజన సంక్షేమానికి హక్కుల సాధనకు ప్రాణత్యాగం చేసిన బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు తదితరుల స్ఫూర్తితో గిరిజనులంతా ముందుకు సాగాలని కోరారు. విద్య ద్వారా జీవన విధానంలో మార్పు ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి ముదిగొండ ఫణి ధూర్జటి, జిల్లా గిరిజన నాయకులు ఏకశిర వెంకటేశ్వరరావు, తుపాకుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏకాగ్రత, ప్రణాళికతో ఉన్నతస్థానానికి చేరొచ్చు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-పామర్రు : ఏకాగ్రత ప్రణాళిక బద్ధమైన జీవన విధానంతో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండల పరిధి కురుమద్దాలిలోని స్కిల్ డెవల ప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనపై కూటమి ప్రభుత్వం దష్టి పెట్టిందని అన్నారు. ఎన్నుకున్న రంగంలో కష్టాలు ఎదురైనా దాన్ని ఇష్టంగా చేసినప్పుడు విజయం సొంతం అవుతుందన్నారు. పామర్రు మండలంలోని అయినంపూడిలో చిన్న పరిశ్రమల హబ్ నిర్మాణం మరో తొమ్మిది నెలల్లో ప్రారంభం కానున్నదని తెలిపారు. ఈ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

జాబ్ మేళా కార్యక్రమానికి 176 మంది నిరుద్యోగులు హాజరు కాగా వారిలో 103 మంది అభ్యర్థులను ఉద్యోగులుగా ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి డి.విక్టర్ బాబు జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి పి. నరేష్ కుమార్,జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ తొర్లపాటి మధు కోఆర్డినేటర్ గుణరంజన్,గ్రామ సర్పంచ్ విజయభారతి పాల్గొన్నారు.



మత్స్యకారులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.శనివారం మంత్రి మచిలీపట్నం మండలంలోని కానూరు, తాళ్లపాలెం గ్రామాలలో మత్స్యకార కుటుంబాలకు మొంథా తుపాను నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పౌరసంఫరాల శాఖ జిల్లా అధికారి జి మోహన్ రావు, మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, గోకవరం పిఎసిఎస్ ప్రెసిడెంట్ మీనవల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



458 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 458మందికి రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు, దంత సమస్యలకు ఏలూరు సెయింట్ జోసఫ్ డెంటల్ వైద్యులు, గుండె సంబంధ వ్యాధులకు విజయవాడ సీవీఆర్ మల్టీ స్పెషాల్టీ హాస్పటల్ వైద్యులు తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం ఉచిత మందులను పంపిణీ చేశారు. ఆదివారం విజయవాడ కామినేని హాస్పటల్, విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, గుడివాడ హెూమియో డాక్టర్ భవాని, హైదరాబాదు మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ హరిహర్ వైద్య పరీక్షలు చేయనున్నట్లు డాక్టర్ వెంకట్రావు తెలిపారు.

గుడ్లవల్లేరులో 12 ఇళ్లకు నష్టం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మొంథా తుపాను కారణంగా మండలంలో 12 ఇళ్లు దెబ్బతిన్నట్లు తహసీల్దార్ బి.లోకరాజు శనివారం తెలిపారు. దెబ్బతిన్న ఇళ్ల వివరాలను జిల్లా కలెక్టరుకు నివేదిక పంపామన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో 238 మంది ఆశ్రయం పొందారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆర్థికసాయం విడుదల కాగానే లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని చెప్పారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం రామన్నపేట గ్రామాలలో శనివారం పిఎసిఎస్ చైర్మన్ మురాల దనేష్ పర్యవేక్షణలో గ్రామానికి చెందిన కూటమి నాయకులతో కలిసి నిత్యవసర వస్తువులు పంపిణీ చేసారు. పోలవరం గ్రామంలో మోంతా తుఫాన్ కారణంగా చేనేత కార్మికులకు పని దినాలు కోల్పోయి తీవ్రంగా నష్టపోయారు. వారికి నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కిన నాగరాజు, మాజీ సర్పంచ్ కారుపర్తి రత్నం, మల్లిబాబు, పిచ్చుక విజయుడు, కటకం వెంకన్న పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోడూరు : ముంథా తుఫాను బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని కోడూరు మండల కూటమి నాయకులు అన్నారు. ముంథాతుఫాన్ కారణంగా పునరావస కేంద్రాల్లో ఉన్న బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసరాల కిట్టు ను కోడూరులోని ఒకటో నెంబర్ రేషన్ షాపు వద్ద కూటమి నాయకులు, వీఆర్వోలు శనివారం పంపిణీ చేశారు. కోడూరు మండల కూటమి నాయకులు బండే శ్రీనివాసరావు, మరే గంగయ్య, కొండవీటి సునీత, కోట రాంబాబు, పూత బోయిన కరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మోపిదేవి : విపత్తులను మనోస్థైర్యంతో ఎదుర్కొంటున్న ప్రజలకు ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం మోపిదేవి మండలం కే.కొత్తపాలెం జడ్పీ హైస్కూల్లో తుఫాన్ బాధితులకు ప్రభుత్వ సహాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.1,531 విలువ కలిగిన నిత్యావసరాలను పంపిణీ చేశారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్, సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, పీఏసీఎస్ చైర్మన్ పూషడపు రత్నగోపాల్ పాల్గొన్నారు. అలాగే మోపిదేవి మండలం నాగాయతిప్ప పిఏసిఎస్ వద్ద తుఫాన్ కారణంగా జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం అందించిన నిత్యవసర సరుకులను పీఏసిఎస్ చైర్మన్ బళ్లా సీతారాం ప్రసాద్, తహసిల్దార్ హరనాథ్ శనివారం పంపిణీ చేశారు.**ప్రజాశక్తి-అవనిగడ్డ :** ఇటీవల సంభవించిన మోం తుఫాను వల్ల ఇబ్బందులు పడ్డ పాత ఎడ్ల లంక గ్రామస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. శనివారం నియోజకవర్గ యువ నాయకులు మండల వెంకట్రావు తుఫాను కారణంగా నష్టపోయిన వారికి బియ్యం, ఉల్లిపాయలు, దుంపలు, పంచదార, వంటనూనె, అందజేశారు.



మోపిదేవిలో...



కోడూరులో...

బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు మండలం యనమల కుదురు గ్రామంలో బాలిక ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం లంబాడిపేటకు చెందిన గుంజి నాని, మల్లేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఒక కుమారుడు. వీరి రెండవ కుమార్తె పుష్పలత, (14) ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్ కి ఉన్న ఐరన్ పైపుకి చున్నితో ఉరివేసుకుని మృతిచెందింది. తల్లిదండ్రులు పనుల నుంచి సాయంత్రం వచ్చి చూడగా ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించడంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.ఇంట్లో జరుగుతున్న గొడవల వల్ల తమ కుమార్తె మృతిచెందిందని ఫిర్యాదులో మృతురాలి తల్లి పేర్కొంది.

దాడి ఘటనలో కేసు నమోదు

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : మండలంలోని కేసరపల్లి గ్రామంలో పంచాయతీ కార్మికులపై దాడి చేసిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం గ్రామంలో డ్రైనేజీల్లో శనివారం పంచాయతీ కార్మికులు బ్లీచింగ్ చల్లుతుండగా రాంబాబు, అతని కుటుంబీకులు దాడి చేశారు.ఈ దాడిలో కార్మికులు రమేష్, జ్యోతి, కొండాలు గాయపడ్డారు. ఈ సంఘటనపై గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడి ఘటనను పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా సిఐటియు గన్నవరం మండల కన్వీనర్ బెజవాడ తాతబ్బాయి మాట్లాడుతూ పంచాయతీ కార్మికులపై విచక్షణా రహితంగా దాడి చేయడం దుర్మార్గమన్నారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

కాశీబుగ్గ ఘటన దురదృష్టకరం : విక్కుర్తి

ప్రజాశక్తి-అవనిగడ్డ : శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఘటన దురదృష్టకరమని ప్రముఖ పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు విచారం వ్యక్తం చేశారు. శనివారం ఆమనగడ్డలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్తీక మాసం కావడంతో కాశీబుగ్గలో గల వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు ఒక్క సారిగా పోటీ ఎత్తడంతో భక్తుల మధ్య జరిగిన తొక్కేసలాటలో పదిమంది మత్యువాత పడ్డారన్నారు. దేవాలయాలలో కార్తీకమాసం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నా రన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కాశిబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసల ఆట ఘటనలో పదిమంది చనిపోవడం పట్ల శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. ఇదే సంఘటనలో గాయపడిన వారిని రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తోంది అన్నారు. ఆలయాలలో భక్తులు అధిక సంఖ్యలో వచ్చినప్పుడు భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శ్రీనివాస్ కోరారు. దేవస్థానాలకు వెళ్ళినప్పుడు భక్తులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఓపికగా మెలగాలని శ్రీనివాస్ సూచించారు.

కుట్టుమిషన్ అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : జనసేన పార్టీ మచిలీపట్నం ఇన్చార్జి, ఉమ్మడి కృష్ణా జిల్లా డిసిఎంఎస్ బండి రామకృష్ణ తన పుట్టినరోజు సందర్భంగా ధ్యానపాటి వరలక్ష్మికి ఉపాధి నిమిత్తం 11వేల రూపాయల విలువైన కుట్టుమిషన్‌ను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మచిలీపట్నం టౌన్ అధ్యక్షులు గడ్డంరాజు, జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు ఏరువ హేమశ్రీ, గంపల భవాని తదితరులు పాల్గొన్నారు.



పేదల సామాజిక భద్రతే లక్ష్యం : ఎంపి



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల సామాజిక భద్రత, ఆర్థిక భరోసానే ప్రధాన లక్ష్యంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం 55వ డివిజన్ ఆరు పంపుల బావి సెంటర్‌లో శనివారం ఎంపి కేశినేని శివనాథ్ పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో వెస్ట్ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్‌తో కలిసి పాల్గొన్నారు. లబ్ధి దారులతో మాట్లాడి.. పెన్షన్‌తో పాటు మహిళలకు, వారి కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపి మాట్లాడుతూ పేదల సంక్షేమంలో ఎక్కడా రాజీ పడకుండా కూటమి ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో 55వ డివిజన్ ప్రెసిడెంట్ జాహీద్, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఎమ్.ఎస్.బేగ్, రాష్ట్ర మైనార్టీసెల్ ప్రధానకార్యదర్శి ఫతావుల్లాహ్, పాల్గొన్నారు.

గోకరాజుపల్లిలో విషాదం

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి



ప్రజాశక్తి-వీరులపాడు : వీరులపాడు మండలం గోకరాజుపల్లికి చెందిన దంపతులు పంచుమర్తి శేషగిరిరావు, అనసూయమ్మ అమెరికాలో జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందారు. వారి కుమారుడు శ్రీనివాసరావు అమెరికాలోని ఫినిక్స్ సిటీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డారు. నాలుగు నెలల క్రితం అమెరికాలో ఉన్న కుమారుడిని చూడటానికి వెళ్లిన ఈ దంపతులు, కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. 15 రోజులుగా చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. వారి మృతదేహాలు శనివారం స్వగ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బంధుమిత్రులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమై చివరి వీడ్కోలు తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గోకరాజుపల్లి గ్రామానికి వెళ్లి పంచుమర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దంపతుల మృతికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలంలో ఎన్టీఆర్ భరోసా మాజిక ఫించన్లను టిడిపి నాయకులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పేదలకు ఫించన్లు ఆర్థిక భరోసానిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి, కిరణ్ కుమార్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

అన్నదానం ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

వన్‌టౌన్ ప్రాంతంలోని (తమినవారి వీధి) జైన్ టెంపుల్ వీధిలో ఆదివారం ఘనంగా శ్రీ సంభవనాథ్ జైన్ శ్వేతాంబర్ మూర్తి పూజక్ సంఘం ఆధ్వర్యంలో మెగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. 25 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ రవివార్ వారాంత అన్నదాన మహెూత్సవానికి ఎంపి కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీ స్వయంగా అన్నదానం ప్రారంభించి, భక్తులకు ఆహారం వడ్డించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ శ్రీ సంభవనాథ్ జినాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ విజయవాడ నగర అభివద్ధి, వాణిజ్య రంగం, సామాజిక సేవల్లో జైనుల పాత్ర అపూర్వమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు జయంతి లాల్, అశోక్ కుమార్, కార్యదర్శి పన్నాలాల్, తదితరులు పాల్గొన్నారు.

టైమ్ బ్యాంకులో భాగస్వాములుకండి : కలెక్టర్ పిలుపు



ప్రజాశక్తి-విజయవాడ : ఎన్‌టీఆర్ జిల్లాలో వినూత్నంగా టైమ్ బ్యాంకు విధానాన్ని అమలుచేసేందుకు పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తున్నామని.. ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టామని.. లోటుపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తామని, ఇందులో యువతీయువకలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో టైమ్ బ్యాంకుపై కలెక్టర్ లక్ష్మీశ సమీక్షా సమావేశం నిర్వహించారు. వాసవ్య మహిళా మండలి, జిల్లా అధికార యంత్రాంగం ఉమ్మడిగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా నాలుగు వారాల పాటు పైలట్ ప్రాజెక్టుగా 46 మంది విద్యార్థులు న్యూ జీజీహెచ్, బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో 446 గంటల సమయాన్ని సేవకు వెచ్చించారు. వీరిద్వారా 312 మంది 5 నిమిషాలు మొదలు గరిష్టంగా 30 నిమిషాల మేరకు సహాయం పొందారు. లగేజీని బయట వరకు తీసుకెళ్లడం, ట్రెయిన్ ఎక్కించడం, అవసరమైన ప్లాట్‌ఫాం వద్దకు చేర్చడం తదితరాలతో పాటు ఆసుపత్రిలో అవసరమైన వార్డుకు రోగులను తీసుకెళ్లడం, వీల్‌ఛెయిర్‌పై రోగులను తీసుకెళ్లడం.. ఇలా వివిధ సేవలు అందించారు. ఈ అంశాలపై సమావేశంలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేశారు. ఈ సేవలను విస్తృతం చేసే క్రమంలో యువతీయువకులు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరముందని కలెక్టర్ పేర్కొన్నారు. సేవలు అందించాలనుకునే వారికి, సేవలు పొందాలనుకునేవారికి ఉపయోగపడేలా ప్రత్యేయ యాప్‌ను రూపొందించనున్నట్లు తెలిపారు. వాలంటీర్లకు ప్రత్యేక యూనిఫాం కూడా ఉండాల్సిన అవసరముందన్నారు. వాలంటీర్లు సమాజానికి ఏదో ఒక రూపంలో సేవ చేస్తే.. వారు ఎంత సమయం పాటు సేవ చేశారనే దాని ఆధారంగా ఆ సమయం టైమ్ బ్యాంక్‌లో కాయిన్ల రూపంలో జమవుతాయని.. వారు సంపాదించిన టైమ్ కాయిన్లను వాలంటీర్లు లేదా వారి కుటుంబ సభ్యులు అవసరమైనప్పుడు వినియోగించుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. విశేష సేవలందించిన వాలంటీర్లకు డిజిటల్ సర్టిఫికేట్లు, మెరిట్ బ్యాడ్జీలు కూడా ప్రదానం చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డా. బి.కీర్తి, ప్రాజెక్టు డైరెక్టర్ రామానుజయ్య, కార్యక్రమ పర్యవేక్షకులు హదయరాజు, సునీతతో పాటు ఎన్ఆర్ఐ ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అగిరిపల్లి) ప్రొఫెసర్లు డా. నాగసుధారాణి, డా. శ్రీలత, 36 మంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కాశీ బుగ్గ మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి : వైసిపి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం జరిగిన తొక్కిసలాటకు ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని వైసిపి విజయవాడ గుంటూరు పార్లమెంట్ ఇన్చార్జి పోతిన మహేష్ ఆరోపించారు. ఈ ఘటనలో సంభవించిన మరణాలు ప్రభుత్వ మరణాలుగా పరిగణించాలన్నారు. ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కార్తీక మాసంలో దేవాలయాలలో రద్దీ కొనసాగుతుందని అధికారులకు, ప్రభుత్వానికి తెలియదా? అని ప్రశ్నించారు. తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం కల్తీ అయ్యిందంటూ చేపట్టిన అసత్య ప్రచారమే రాష్ట్రంలో దేవాలయాల్లో వరుసగా జరుగుతున్న మరణాలకు కారణం అన్నారు.కాశీబుగ్గ తొక్కిసలాటకు ప్రభుత్వం బాధ్యత వహించాలంటూ పేర్కొన్నారు.

ఎన్‌టిఆర్ సర్కిళ్ల ఏర్పాటుకు కృషి

ఎంపి కేశినేని

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

భావితరాలకు స్ఫూర్తి అందించేలా ఎన్టీఆర్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఎన్టీఆర్ సర్కిళ్లను ఏర్పాటు చేస్తామని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని పటమట ఎన్టీఆర్ సర్కిల్ ఆధునీకరణ పనులను శనివారం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పరిశీలించారు. అనంతరం ఎంపి మీడియాతో మాట్లాడుతూ పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లో చేపట్టిన ఆధునీకరణ పనులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి పరిశీలించటం జరిగిందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కొన్ని సూచనలు చేయటం జరిగిందని, అందుకు అనుగుణంగా మార్పులు చేసి అతి త్వరలో ఎన్టీఆర్ సర్కిళ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అలాగే వెస్ట్ నియోజకవర్గంలో ఎన్టీఆర్ సర్కిల్ ఏర్పాటు సన్నహాలు మొదలైనట్లు తెలిపారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ ప్రజలందరికీ నచ్చే విధంగా ఎన్టీఆర్ సర్కిల్ ను తీర్చిదిద్దుతామన్నారు.

ప్రభుత్వంపై తాడోపేడో తేల్చుకుంటాం

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి



ప్రజాశక్తి-విజయవాడ : శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కార అయ్యేంత వరకు సిఐటియు, కెవిపిఎస్ అండగా ఉండి ఆందోళన ఉదతం చేస్తామని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి హెచ్చరించారు. విజయవాడలోని అంబేద్కర్ స్మృతివనంలోని శానిటేషన్ కార్మికుల రిలే నిరాహారదీక్షలకు దిగారు. సిఐటియు, కెవిపిఎస్ ఆధ్వర్యంలో తొలి రోజు (శనివారం) ప్రారంభమైన కార్మికుల దీక్షలను కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు ప్రారంభించగా, సాయంత్రం సిఐటియు సెంట్రల్ సిటీ నాయకులు ఎం సోమేశ్వరరావు కార్మికులకు జ్యూస్ అందజేసి, దీక్షలను విరమింప చేశారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ...అంబేద్కర్ స్మృతివంలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులను కూటమి ప్రభుత్వం పచ్చిమోసం, దగా చేసిందని ధ్వజమెత్తారు. పది మాసాల పెండింగ్ వేతనాల కోసం వివిధ రూపాల్లో కార్మికులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం కానీ, జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్, రాష్ట్ర సాంస్కృతికశాఖ అధికారులు పట్టించుకోకపోవడం, సదరు కాంట్రాక్టర్ అందుబాటులో లేకపోవడం అత్యంత దారుణమన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పేరుతో నిర్మితమైన స్మృతివనంలో పని చేస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఈ ప్రభుత్వానికి అంబేద్కర్‌పట్ల, రాజ్యాంగం పట్ల ఏమేరకు చిత్తశుద్ధి ఉందో ఇట్టే తెలిసిపోతోందని ధ్వజమెత్తారు. జీతాల సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తక్షణమే కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కార అయ్యేంతవరకు సిఐటియు, కెవిపిఎస్ వారికి అండగా ఉండి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అంబేద్కర్ స్మృతి వనంను వ్యాపార కేంద్రంగా కాకుండా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు యం.బాబురావు, వై.సుబ్బారావు, స్మృతి వనం కార్మికులు పాల్గొన్నారు.

భవానీ దీక్ష ధారణలు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ ఆలయంలో 2025వ సంవత్సరానికి భవానీ దీక్ష ధారణ కార్యక్రమం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ 6వ అంతస్తులోని మహా మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా, అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ప్రధాన ఆలయం నుండి 6వ అంతస్తు వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ ఛైర్మన్ రాధాకష్ణ, ఆలయ ఏ.ఈ.ఓ బి. వెంకటరెడ్డితో కలిసి ఆలయ ప్రాంగణం నుండి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ స్థానాచార్యులు వి. శివప్రసాద శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుల నుండి భవానీలు మాలధారణ స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని ఛైర్మన్ బొర్రా రాధాకష్ణ, ఏ.ఈ.ఓ బి.వి.రెడ్డి, ఫెస్టివల్ సెక్షన్ సునీత, సూపరింటెండెంట్ పర్యవేక్షించారు.



పంటల పరిశీలన

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గంలో మాగల్లు గ్రామంలో వైసిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇంచార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, జిల్లా రైతు విభాగం అద్యక్షులు ఏలూరి శివాజీ శనివారం పర్యటించారు. మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో, మునేరు ఆయకట్టులో నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించే అందించాలని డిమాండ్ చేశారు.



నిజాయితీ కలిగిన అధికారి శ్రీనాథ్‌రెడ్డి

- ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ ఇంజినీర్‌గా శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన ఆర్ శ్రీనాథ్‌రెడ్డిని ఆయాశాఖల ఉన్నతాధికారులతో కలిసి నగర కమిషనర్ ధ్యానచంద్ర శనివారం తన చాంబర్‌లో ఘనంగా సత్కరించారు. శ్రీనాథ్‌రెడ్డి చీఫ్ ఇంనీర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన గడిచిన ఈ ఏడాది కాలంలో నగరానికి ఆయన చేసిన పలుసేవలను కమిషనర్ గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా దసరా, భవానీ దీక్షల విరమణ, వరదలు, తుఫాను, న్యూ ఆర్‌ఆర్‌పేటలో ఇటీవల చోటు చేసుకున్న డయేరియా నివారణకు తీసుకున్న చర్యల్లో సి.ఇ పాత్ర ప్రశంశనీయమని పేర్కొన్నారు. ఆయా సందర్భాల్లో ఆయాశాఖల అధికారులను, ముఖ్యంగా ఇంజినీరింగ్ విభాగం అధికారులను సమన్వయం చేసుకుంటూ... సమస్యల పరిష్కారానికి సి.ఇ ఎంతో కృషి చేశారని కమిషనర్ పేర్కొన్నారు.

పి4తో పేదల కుటుంబాల్లో వెలుగు : మంత్రి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీ పట్నం మండలం పెదపట్నంలో నివాసం ఉంటున్న యానాది కుటుంబాలను ప్రభుత్వం ప్రకటించిన పి-4 కార్యక్రమం కింద దత్తత తీసుకుంటున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటించారు. శనివారం పెన్షన్ల పంపిణీ కోసం వచ్చిన మంత్రి యానాది కుటుంబాల స్థితిగతుల్ని చూసి చలించి పోయారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్స రాలు పూర్తైనా ఇంకా తిండికి, బట్టకు, నిలువ నీడ కోసం ప్రజలు కష్టాలు పడడం బాధాకరం అన్నారు. ఆ కుటంబాల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. సరైన గుర్తింపు కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందడం లేదని చెప్పడంతో తక్షణమే ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇప్పించాలని, ఇళ్ల స్థలా లు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. కొల్లు ఫౌండేషన్ ద్వారా పిల్లల చదువులకు, కుటుంబంలోని వారికి ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలుగుదేశం పార్టీ రూరల్ అధ్యక్షులు కాగిత వెంకటేశ్వరరావు, గోపు సత్యనారాయణ, తలారి సోమశేఖర్ లంకె నారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.



యానాది కుటుంబాలతో మంత్రి కొల్లు రవీంద్ర



తహశీల్దారుకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి

కోడూరు తహశీల్దార్‌కు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి-కోడూరు : ముంథా తుఫాన్ సమయంలో విశిష్టమైన సేవలు అందించినందుకు గాను కోడూరు మండలం ఇన్చార్జి తాసిల్దార్ సౌజన్య కిరణ్మయిను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. శనివారం అమరావతిలో జరిగిన సైక్లోన్ ముంథా తుఫాన్ ఫైటర్స్ కార్యక్రమంలో భాగంగా కోడూరు తాసిల్దార్‌కు ప్రశంసా పత్రాన్ని ముఖ్యమంత్రి అందించారు. ఈ సందర్భంగా కోడూరు మండలాధికారులు ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రముఖులు తాసిల్దార్ కు అభినందనలు తెలియజేశారు.



వికలాంగులకు నూతన వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : హై5 యూత్ ఫౌండేషన్, వాసవి జాగతి ఇంటర్నేషనల్ సంయుక్తంగా గుడ్లవల్లేరులో 160 మంది కార్మికులు, వికలాంగులకు నూతన వస్త్ర బహుకరణ శనివారం చేశారు. కొల్లిపర సత్యనారాయణరావు ధర్మపత్ని సత్యవతి దంపతుల మనవడు కొల్లిపర సత్య వెంకట రాజేష్ జ్ఞాపకార్థం కొల్లిపర పార్థసారథి, అనసూయ దంపతులు ఈ కార్యక్రమాన్ని ఎస్.ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ చేతుల మీదుగా నిర్వహించారు. వాసవి జాగతి ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ తిరువీధి వేణుగోపాల్, హై5 యూత్ ఫౌండేష వ్యవస్థాపకుడు డాక్టర్ గోట్రు నాగబాబు, వాసవి జాగతి గుడివాడ అధ్యక్షుడు శేగు వెంకట ప్రసాద్, శేగు భవిత, గాదే మోహన్ బాబు, కంతేటి హరినాధ బాబు, సంపూర్ణమ్మ జూపూడి, గుడ్లవల్లేరు మండల సెక్రటరీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : వృత్తిపర విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న జ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో ప్రయోగిస్తే మరింత అనుభవజ్ఞులుగా ఎదుగుతారని కెడిసిసి బ్యాంక్ సీఈఓ శ్యాం మనోహర్ తెలిపారు. స్థానిక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వత్తిపర శిక్షణ (ఆన్ ది జాబ్ ట్రైనింగ్) శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలపాటు బ్యాంకులు, వివిధ శాఖల్లో షెడ్యూల్ ప్రకారం శిక్షణ కొనసాగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. లక్ష్మి మాట్లాడుతూ వత్తిపర విద్యార్థులు క్షేత్రస్థాయిలో శిక్షణ పొందేలా ఏర్పాట్లు చేశామన్నారు. అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ కోర్సు విద్యార్థులకు కష్ణా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్, స్టేట్ టాక్స్ ఆఫీసుల్లో, ఆఫీస్ అసిస్టెంట్‌షిప్ కోర్సు విద్యార్థులకు మండల పరిషత్ కార్యాలయం, ఎస్‌సీ కార్పొరేషన్‌లలో, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు జిల్లా పరిషత్, బీసీ కార్పొరేషన్ కార్యాలయాల్లో శిక్షణ కల్పించనున్నట్లు ఆమె వివరించారు. కెడిసిసి బ్యాంక్ జనరల్ మేనేజర్ బి.ఎల్. చంద్రశేఖర్, అధ్యాపకులు లంకిశెట్టి హరనాధ్ బాబు, మున్వర్, శిరీషతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి-పామర్రు : సైన్స్ అనే విజ్ఞానంతో మూఢనమ్మకాలు అనే అజ్ఞానాన్ని సమాజంలో నుండి రూపుమాపవచ్చునని ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ సురేష్ రెడ్డి అన్నారు.జనవిజ్ఞాన వేదిక పామర్రు మండలం శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలు స్థానిక కంచర్ల రామారావు జిల్లా పరిషత్ హైస్కూల్ లో నిర్వహించారు. మండలంలోని 14 ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలకు చెందిన 42 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.జమీదగ్గుమిల్లి జెడ్.పి హైస్కూల్ ప్రథమ స్థానంలో, కొత్త నిమ్మకూరు జెడ్.పి హైస్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఈకార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దునుకు రఘునాధరావు, కె.నాగ మల్లేశ్వరరావు, ప్రధానోపాధ్యా యులు కంచర్ల కోటేశ్వ రరావు, ఉపాధ్యాయుడు కొడాలి వెంకటేశ్వరరావు, జనవిజ్ఞాన వేదిక కార్యకర్త పెనుమాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

కెయు ఆంగ్ల విభాగంలో స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఎంఏ ఆంగ్ల విభాగంలో సీట్లు భర్తీకి త్వరలో స్పాట్ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆంగ్ల శాఖ విభాగాధిపతి ఆచార్య ఈ దిలీప్ తెలిపారు. వివిధ కారణాల వల్ల గతంలో విద్య ను అభ్యసించలేని వారికి ఇది సదవకాశమని, ఆంగ్ల శాఖలో ఎంఏకు సంవత్సరానికి ఫీజు పదకొండు వేలు మాత్రమే చెల్లించవలసి ఉంటుందన్నారు. స్పాట్ అడ్మిషన్ల లో చేరే వారికి ఫీజు రీయింబర్స్మెంట్ వర్తించదన్నారు. సీటు కోసం ఆసక్తి ఉన్న వారు 9494747401 ఫోన్ నెంబర్ లో సంప్రదించవచ్చన్నారు. ఇటీవల ఎంఏ పూర్తి చేసిన వారు నూరు శాతం ఉద్యోగం పొందారని ఆయన ఒక ప్రకటన లో తెలిపారు.



స్టూడెంట్స్ లెడ్ కాన్ఫరెన్స్‌లో ఫస్ట్ క్లాస్ సాధించిన విద్యార్థులు

'నారాయణ'లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ నారాయణ పాఠశాలలో ఫస్ట్ క్లాస్ విద్యార్థులకు స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని పాఠశాలలో ఇప్పటివరకు నేర్చుకున్న పలు అంశాలను పేరెంట్స్‌కు ప్రాక్టికల్ రూపంలో తెలియజేశారు. విద్యార్థులు జూన్ నెల నుండి ఇప్పటివరకు పాఠశాలలో నేర్చుకున్న పార్టీ అంశాలు ఉపాధ్యాయుల సహాయం లేకుండా ప్రాక్టికల్ రూపంలో తల్లిదండ్రులకు తెలియజేయడం ద్వారా విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్ పెరుగుతుందని పాఠశాల ప్రిన్సిపల్ సుమంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఈ చాంప్స్ కోఆర్డినేటర్ లియోని, వైస్ ప్రిన్సిపల్ సుజాత, ఉపాధ్యాయులు వహీదా, మనీషా తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌విఎల్ క్రాంతి డిగ్రీ కళాశాల్లో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని ఎస్‌విఎల్ క్రాంతి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. శనివారం తతీయ సంవత్సరం విద్యార్థిని విద్యార్థు లు, మొదటి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ దుట్ట ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నూతనంగా కళాశాలలో చేరే విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యనుభ్యసించాలని, ఉత్తమ మార్కు లు సాధించి ఉన్నతమైన స్థానాలకు ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు పిరమిడ్ ఆకారాలు, డాన్సు లు, ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ రాజేంద్రప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు, అధ్యాపకులు ,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శిఖర ప్రతిష్ట

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి శిఖర ప్రతిష్టా మహోత్సవాలను కనులపండువగా శనివారం నిర్వహించారు. శిఖర ప్రతిష్టా మహోత్సవంతో పాటు ధాన్య, ధేను దర్శనం, శాంతి కల్యాణంలో పాల్గొని భక్తులెల్లరూ శ్రీ సత్యదేవుని ఆశీర్వచ నాలు పొంది అన్న ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, నెప్రూరా పశు వుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, డైరెక్టర్లు వల్లభనేని కష్ణప్రసాద్(నాని), పోలవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ నియోజకవర్గ ప్రజల ఆరోగ్య భద్రతకు ఎమ్మెల్యే రాము కషి చేస్తున్నారని కూటమి నాయకులు తెలిపారు. గుడివాడ టిడిపి కార్యాలయం (ప్రజా వేదిక)లో బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఉదయం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని 15మంది బాధితులకు మంజూరైన రూ.8లక్షల 11వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు, ఎమ్మెల్యే సోదరుడు వెనిగండ్ల రామకష్ణ, నందివాడ, గుడివాడ రూరల్, గుడ్లవల్లేరు మండలాల నాయకులు బాధిత కుటుంబాలకు అందజేశారు. పండ్రాజు సాంబయ్య, ఏపీ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడి నాగరాజు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఆరేకపూడి రామశాస్త్రిలు, సర్పంచ్ సింగాల రాధాకష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాలు పరిశీలన

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం కంచకోడూరు గ్రామంలో మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను,తుఫాన్ వల్ల నష్టపోయిన పంట పొలాలను పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకొన్నారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి అవసరమైన సహాయ చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తానని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పోతన స్వామి, కోలపల్లి రజిని, కటకం నాగమల్లేశ్వరరావు, గోపి నాగ బాబు, ఎన్ ఏ బేగ్, కోళ్ల నాగరాజు, మునగాల భాస్కర్ పాల్గొన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న కాగిత కృష్ణప్రసాదు




విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారిణి శైలజ

విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల : విద్యార్థులకు చదువుతోపాటు ఆటల్లోనూ ప్రావీణ్యత కలిగించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ అధికారి కే శైలజ అన్నారు. శనివారం పమిడిముక్కల మండలంలోని ఐనపూరు ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించి రికార్డులు పరిశీలించి విద్యార్థులతో వారి విద్యా విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. 10వ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణులయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐనపూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమన్న వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

దిగుబడిపై రైతుల్లో నిరాశ



ప్రజాశక్తి-కంచికచర్ల : మొంథా తుపాను ప్రభావం రైతులకు గుండె కోత మిగిల్చింది. పంట చేతికొచ్చే సమయానికి పంటలన్నీ నీట మునగటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధిక వర్షాలు, తెగుళ్ల దాడులు, మార్కెట్‌లో ధరలు తగ్గిపోవడం అన్ని కలిసి రైతుల ఆశలు నీరుగారాయి. పత్తి, పెసర, వరి పంటలు అపార నష్టం వాటిల్లింది. విత్తనాల ఖర్చు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెప్టెంబర్‌లో కురిసిన వర్షాల దెబ్బకు పెసర, మినుము పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పొలాలు నీటమునిగిపోవడంతో మొక్కలు కుళ్లిపోయి, కాయలు పాడైపోయాయి. పంటలు కోత దశకు వచ్చేసరికి వర్షాల తాకిడికి పూర్తిగా నష్టపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. విత్తనాలు, ఎరువులు, కూలీలకు పెట్టిన ఖర్చు తిరిగి రాకపోవడంతో రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. తాజాగా మొంథా తుపానుకు మొక్కజొన్న, మిర్చి, పత్తి, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరి పొలాలు రోజుల తరబడి నీటిలో మునగడంతో పంట దిగుబడి పూర్తిగా తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం మూడు వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పత్తి, మొక్కజొన్న పంటలు పూర్తిగా వర్షార్పణం అయ్యాయి. రైతులు నెలల తరబడి కష్టపడి వేసిన పంటలు ఒక్క తుపాను దెబ్బకు నాశనం కావడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. ప్రభుత్వమే ముందుకొచ్చి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని, ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంట బీమా పరిహారం తక్షణమే చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ




ప్రజాశక్తి-వత్సవాయి : మొంథా తుఫాను కారణంగా పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన కొంత మంది వరద బాధితుల కోసం కూటమి ప్రభుత్వం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. గత నాలుగు రోజులుగా పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాధితులకు ప్రభుత్వం అందించిన నిత్యావసర సరుకులను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శాంతి శ్రీ, పెనుగంచిప్రోలు మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, పాల్గొన్నారు.

మత్స్యకారులకు నిత్యావసరాలు అందజేత



ప్రజాశక్తి-చందర్లపాడు: మత్స్యకార కుటుంబాల జీవనోపాధికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వాసిరెడ్డి ప్రసాద్ పేర్కొన్నారు. చందర్లపాడు మండలం కోనాయ పాలెం గ్రామంలో వరద బాధితులైన 12 మంది ఎస్‌టి మత్స్యకారులకు 50 కేజీల బియ్యం, పంచదార, కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళదుంపల కిట్లను చందర్లపాడు మాజీ జడ్పీటీసీ, కోనాయపాలెం పీఏసిఎస్ బ్యాంక్ చైర్మన్ వాసిరెడ్డి ప్రసాద్, గ్రామ సర్పంచ్ మార్కపూడి వెంకట్రావమ్మ చేతుల మీదగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎస్‌టి మత్స్యకారులకు నిత్యావసర సరుకులు అందించడం అభినందనీయమని తెలిపారు.

ఆర్థిక భరోసానే ప్రధాన లక్ష్యం : ఎమ్మెల్యే



ప్రజాశక్తి-మైలవరం : పేదల సామాజిక భద్రత, ఆర్థిక భరోసానే ప్రధాన లక్ష్యంగా పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. శనివారం మైలవరంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా పింఛన్లు పెంచి ఇస్తున్నామన్నారు. అన్ని వర్గాల వారికి ఆర్థికంగా చేయూత అందిస్తున్నామన్నారు. పేదల సంక్షేమంలో ఎక్కడ రాజీ పడకుండా కూటమి ప్రభుత్వం పథకాలు అందజేస్తుందన్నారు. అనంతరం రెండు చౌక ధరల దుకాణాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థుల కోసం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.లక్ష్మణరావు ప్రచురించిన ఎన్‌ఎంఎంఎస్ మెంటల్ ఎబిలిటీ (ఎంఎటి) మెటీరియల్‌ను యుటిఎఫ్ ఇబ్రహీంపట్నం మండల శాఖ శనివారం విద్యార్థులకు అందజేసింది. విద్యార్థుల కోసం విలువైన మెటీరియల్ తయారు చేసి, ఉచితంగా పంపిణీ చేశారు.

మైలవరంలో కోటి సంతకాల సేకరణ



ప్రజాశక్తి-మైలవరం : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి మైలవరం టౌన్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక అనిమిరెడ్డి కాంప్లెక్స్ వద్ద పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్లకు దారాధత్వం చేస్తూ సామాన్యులపై భారాలు మోపుతున్నారని, కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పాల నారాయణరెడ్డి, పామర్తి శ్రీనివాసరావు, దేవరకొండ ఆంజనేయులు, తోట తిరుపతిరావు, స్వామి ఎన్ డి పి బ్రదర్స్, తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు ఎస్‌ఐగా అభిమన్యు బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-వీరులపాడు : ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా బి అభిమన్యు శనివారం బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఉదయం వీరులపాడు స్టేషన్ నందు విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘీక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్‌ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

ప్రజాశక్తి-వీరులపాడు


మొక్కల పెంపకం సామాజిక బాధ్యత అని ఇండోఫిల్ డిజిఇ శ్రీమన్నారాయణ రెడ్డి తెలిపారు. వీరులపాడు మండలం జుజ్జూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఇండో ఫీల్ కంపెనీ నిర్వామకులు శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా జిల్లాలోని పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి వెంకయ్య, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి మొక్కలు నాటి మొక్కల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో పవిత్ర సంగమం సమీపంలోని ఫుడ్ మామ హోటల్ వద్ద షవర్మ కార్మికుడిపై కొండపల్లి ఎస్ఐ పురుషోత్తం లాఠీతో దాడి చేయడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని, కార్మికుడు హేమంతుపై దాడి చేసిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాత్రింబవళ్లు అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుడిపై దాడి చేయడం దారుణమన్నారు. ఎస్ఐ స్థాయి వ్యక్తి నిగ్రహం కోల్పోయి కార్మికుడిని కొట్టేంత నేరం ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ ఉన్నతాధికారులు ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరీక్షా కేంద్రాలు సందర్శన

ప్రజాశక్తి-వీరులపాడు : మండలం అల్లూరు జుజ్జూరు వీరులపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగే పరీక్ష కేంద్రాలను అధికారులు శనివారం సందర్శించి తనిఖీ చేశారు. జిల్లా విద్యా అధికారి యు.వి. సుబ్బారావు ఆదేశాల మేరకు నందిగామ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఏ. శ్యామ్ సుందర్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ వీరులపాడు మండల పరిధిలోని ప్రతిపాదిత ఎస్‌ఎస్‌సి- 2026 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ప్రతి పాఠశాలలో ఉన్న సదుపాయాలు, విద్యార్థుల కోసం అవసరమైన మౌలిక వసతులు, తాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, సీటింగ్ ఏర్పాట్లు వంటి అంశాలను పరిశీలించారు.



సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-వత్సవాయి : వత్సవాయి మండలంలోని లింగాల గ్రామానికి చెందిన ముగ్గురు, డబ్బాగుపల్లి గ్రామానికి చెందిన నలుగురు, రామచంద్రపురం గ్రామానికి చెందిన నలుగురు, కంభంపాడు గ్రామానికి చెందిన ఇద్దరు, అలాగే మాచినేనిపాలెం, వేముల నర్వ గ్రామాలకు చెందిన ఇద్దరు మొత్తం 15 మందికి గాను రూ.6 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్వయంగా అందజేశారు. అనంతరం, కంభంపాడు గ్రామంలో నూతనంగా మంజూరైన పెన్షన్లను కూడా ఎమ్మెల్యే లబ్ధిదారుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల టిడిపి అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

పాఠశాలలో సైకిల్ షెడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని కనుమూరు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల వాహనాల సౌకర్యార్థం సైకిల్ షెడ్డు ఏర్పాటు చేశారు. ఆ గ్రామ సమీప బంధువు బొల్లారెడ్డి వెంకట్ రావమ్మ జ్ఞాపకార్థం ఈ షెడ్డు నిర్మితమైంది. శనివారం జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు చెరుకూరు రాజేశ్వర ప్రారంభించారు.

దేవస్థానాలకు పాలకవర్గాలు నియామకం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరులోని గ్రూపు దేవస్థానాలైన శ్రీ వేంకటాచల స్వామి దేవస్థానం, శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గాలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. శ్రీవేంకటాచలం దేవస్థానం పాలకవర్గ అధ్యక్షునిగా పర్వతం శ్రీనివాసరావు, సభ్యులుగా కొంగుల వెంకటరమణమ్మ, యంద్రాతి చంద్ర శేఖరరావు, తమ్మి వెంకటేశ్వరరావు, బొలగాని త్రివేణి, బత్తుల వెంకటేశ్వరరావు, నాళ్లా సీతా కుమారి నియమితులయ్యారు. శ్రీరామలింగే శ్వరస్వామి దేవస్థాన పాలకవర్గ చైర్మన్‌గా జంగాల మురళీకృష్ణ, సభ్యులుగా విశ్వనాధుని మాధవాచారి, కొప్పుల కష్ణారావు, వేముల అపర్ణ, మోదుగు రవి, ఇజ్జగాని రమాదేవి, అరిపిరాల నాగ రాజేశ్వరి, సపావటు జమున, ఉయ్యూరు మీనాకుమారి, భవాని రాధాకష్ణ శాస్త్రి లను నియమించారు.



కృషి విజ్ఞాన కేంద్రంలో 'జన్ జాతీయ గౌరవ దివస్'


ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని గరికపాడు డాక్టర్ కే.ఎల్. రావు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకె)లో శనివారం జన్ జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.రవి కిషోర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఐ. వెంకట్ రెడ్డి పాల్గొని జన్ జాతీయ గౌరవ దివస్ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బావిలోపడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-వత్సవాయి : ప్రమాదవశాత్తు ఓ వృద్ధుడు బావిలో పడి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనుగంచిప్రోలుకు చెందిన తేజ వత్తు ధనమూర్తి (55) గత 30 సంవత్సరాలుగా శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం గోశాలలో విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం చెరువు కట్ట వద్ద బావిలో శవమై తేలాడు. పెనుగంచిప్రోలు ఎస్ఐ అర్జున్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొంత కాలం క్రితం ఆయన చిన్న కుమారుడు, ఇటీవల పెద్ద కుమారుడు మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : దేశంలోనే అత్యధికంగా పింఛన్లు అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, పేదల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం అని రాష్ట్ర గనులు భూగర్భవ నరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం మండలం, పెదపట్నం గ్రామంలో శనివారం ఉదయం మంత్రి పింఛన్లు పంపిణీ చేశారు. కొన్నేళ్లుగా పక్షవాతం, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైన గ్రామానికి చెందిన దాసి గంగా భవాని అనే మహిళకు మంత్రి రూ. 15 వేల పింఛను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ నెలలో మొదటి తేదీనే పింఛన్లు అందిస్తున్నామన్నారు. మంత్రి వెంట ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, గోకవరం పిఎసిఎస్ ప్రెసిడెంట్ మీనవల్లి నాగేశ్వరరావు ఉన్నారు.**ప్రజాశక్తి-గూడూరు :** గూడూరు మండలం గూడూరు గ్రామంలోని కాగిత వెంకట్రావు కాలనీలో లబ్ధిదారుల ఇంటివద్దకు వెళ్లి ఎంఎల్ఏ కాగిత కృష్ణప్రసాదు పింఛన్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పెంచి పేదలకు ఆర్థిక భరోసాను కూటమి ప్రభుత్వం కల్పించిందన్నారు. కూటమి నాయకులు, పోతన స్వామి, కొల్లపల్లి రజిని, దాసరి ఉమా సాయి రాం, గోపి నాగబాబు, ఎన్ ఏ బేగ్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** యనమలకుదురులో పెన్షన్లను రాష్ట్ర బీసీ గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శౌంఠి శివరామ ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక తెలుగుదేశం నాయకులు, సచివాలయం సిబ్బంది కలిసి ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ తాడిశెట్టి ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) :** గన్నవరం మండల టీడీపీ అధ్య క్షులు గూడపాటి తులసిమోహన్ జక్కులనెక్కలం గ్రామంలో పర్యటించి, లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛను అందజేశారు. గ్రామ టీడీపీ అధ్యక్షులు తుల్లిమిల్లి బాలసుబ్రహ్మణ్యం, ఇతర పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


బందరులో...


కంకిపాడులో...


గన్నవరం మండలంలో...



వరద నీరు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-చల్లపల్లి : ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా చల్లపల్లి నారాయణరావు నగర్ గురుకుల పాఠశాల వద్ద గల నాలుగు రోడ్లు జలమయంగా మారాయి. శనివారం సిపిఎం మహిళా శాఖ సభ్యులు ముంపుకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. నేటికీ ఆ ప్రాంతంలో నీరు నిల్వ ఉండటంతో దోమలకు, ఈగలకు అవసాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీటి నుండి దుర్వాసన వస్తోందని ఆరోపించారు. ఈ ప్రాంతమంతా పల్లముగా ఉండటంతో మురికినీరునిల్వ ఉండటంతో ఈ ప్రాంత వాసులు ఆరోగ్యాన్ని గురువుతారని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు తగ్గి మూడు రోజులైనా పల్లాలలోని నీటిని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు స్పందించి ఆ నీటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మహిళా శాఖ కార్యదర్శి నారం శివ లీల, కేదరాశి గోవిందమ్మ, పెట్ల శాంతి కుమారి, నంద్యాల ప్రభు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములు అని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కొనియాడారు. శనివారం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మంత్రి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వీ.విద్యాసాగర్ నాయుడు, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ , డిఆర్ఓ చంద్రశేఖర రావు తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.అలాగే తెలుగు ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి. యుగంధర్ తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** ఆంధ్ర రాష్ట్రం ఏర్పడడానికి పొట్టి శ్రీరాములు తన ప్రాణాన్ని అర్పించారని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నండూరి పిచ్చేశ్వరరావు అన్నారు. శనివారం పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఖాదర్ బాషా, సుబ్బారావు, శ్రీనివాసారవు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - మొవ్వ:** మొవ్వ మండలం కూచిపూడి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠంలో శనివారం ప్రధానాచార్యులు (పూర్తి అదనపు బాధ్యతలు) డాక్టర్ ఎం శ్రీనివాసరావు సూచనలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ కోసం పోరాడి అసువులు బాసిన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ ఎన్ వెంకటేశ్వరరావు, టీచింగ్ అసిస్టెంట్ పసుమర్తిహరినాథ శాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) :** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గన్నవరంలోని ఆర్యవైశ్య కర్మల భవన్లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ అధ్యక్షులు వీసం ప్రసాదరావు, సంస్థ చైర్మన్ మడుపల్లి బాలకష్ణమూర్తి, గౌరవ సలహాదారు ముక్కామల సుబ్బారావు, సంస్థ ఉపాధ్యక్షులు పువ్వల ఆదినారాయణ, సంయుక్త కార్యదర్శి వడ్లమూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు మండలం వణుకూరు గ్రామంలో మెడికల్ కాలేజ్ ల ప్రయివేటికరణ ను వ్యక్తిరేకిస్తూ ప్రజా మద్దతును సంతకాల రూపంలో సేకరించే కార్యక్రమాన్ని వైసిపి నాయకులు దేవభక్తుని చక్రవర్తి శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు విద్యా, వైద్యాన్ని దూరం చేస్తున్న ఈ కూటమి అరాచక పాలన విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

జాయింట్ ఎల్‌పిఎం సమస్య పరిష్కారానికి చర్యలు

- ఎపి ల్యాండ్ సర్వే డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్

ప్రజాశక్తి -నందివాడ : మండలంలోని అనమనపూడి గ్రామంలో జాయింట్ ఎల్పిఎంలు పట్టాదారులుగా నమోదైన భూములను ఏపీ ల్యాండ్ సర్వే డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్, ఆర్జేడీ కేజీయా క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్.కూర్మనాథ్ గ్రామంలో జాయింట్ ఎల్.పి.ఎంలు ఎన్ని ఉన్నాయి, వాటి మీద తీసుకున్న చర్యలు గురించి సంబంధిత అధికారులను వివరాల అడిగి తెలుసుకున్నారు. జాయింట్ ఎల్పిఎంలు కారణంగా పడుతున్న ఇబ్బందులను అధికారులకు రైతులు వివరించారు.ఏడి సర్వే జోషిలా, నందివాడ ఎమ్మార్వో ఎన్. గురుమూర్తి రెడ్డి, ఐఓఎస్ లీలాప్రసాద్, ఆర్ఐ గణేష్, సర్వేయర్లు రైతులు పాల్గొన్నారు.

నేడు గన్నవరంలో పంచాయతీ వర్కర్ల మహాసభ


మాట్లాడుతున్న మామిడి గణేష్

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్న వరం) : ఆంధ్రప్రదేశ్ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కృష్ణా జిల్లా 9వ మహాసభ ఈ నెల 2 వ తేదీ ఆదివారం గన్నవ రంలో జరుగు తుందని, దీనిలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘం గన్నవరం మండల అధ్యక్షులు మామిడి గణేష్ అన్నారు. శనివారం స్థానిక చింతపల్లి పాపారావు భవనంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో గణేష్ మాట్లాడుతూ కార్మికుల ఆవేదనను ఆర్థిక అనిశ్చితిని ప్రభుత్వం గుర్తించే విదంగా ఈ మహాసభలో చర్చ జరుగుతుందని, ఈ చర్చల్లో పాల్గొనేందుకు కృష్ణా జిల్లాలోని 25 మండలాల్లో ఉన్న 498 గ్రామ పంచాయతీల నుండి 250 మంది కార్మికులు పాల్గొంటారని అన్నారు. ఈ మహాసభకు రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారని వివరించారు. సిఐటియు గన్నవరం మండల కన్వీనర్ బి. తాతబ్బాయి, కౌలు రైతు సంఘం గన్నవరం మండల కార్యదర్శి కైలే ఏసుదాసు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి-చల్లపల్లి : అమెరికాలోని (అమెరిన్ తెలుగు అసోసియేషన్) చందు నరసింహారావు చొరవతో పేద కుటుంబాలకు సేవలు అందించటం ముదావహమని అని జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. చల్లపల్లిలో భర్తను కోల్పోయి ఇద్దరు ఆడపిల్లలతో జీవిస్తున్న తల్లి నాగభారతి కుటుంబానికి ఆప్త ఆధ్వర్యంలో శనివారం చేయూత అందించారు. రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు 50 కిలోల బియ్యం తల్లి కుమార్తెలకు నూతన దుస్తులను అందించారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి సొసైటీ చైర్ పర్సన్ బొందలపాటి వీరబాబు, నేతలు అడపా రవి,ప్రెస్ పూర్ణ, నందగోపాల్, మిరియాల జితేందర్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధిలో చాగంటి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-మోపిదేవి : ప్రముఖ ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (విద్యార్థులలో నైతికత, విలువలు) బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు 200మంది శిష్యబందంతో దివిసీమ ఆధ్యాత్మిక పర్యటనకు విచ్చేశారు. మోపిదేవి పుణ్యక్షేత్రంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆయనకు స్వాగతం పలికారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, దేవస్థాన ప్రధాన అర్చకులు బుద్ధు పవన్ కుమార్ శర్మ, అర్చకులు అపూర్వ స్వాగతం పలికారు. చాగంటి కోటేశ్వరావు ఆలయంలో స్వామివారి నాగపుట్టలో పాలు పోసి పూజలు చేశారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకున్న చాగంటి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిం చుకున్నారు.

మెకానిక్‌లను కార్మికులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు

ప్రజాశక్తి-పామర్రు : టు వీలర్ మోటార్ సైకిల్ మెకానిక్లను అసంఘటిత కార్మికులుగా గుర్తించాలని పామర్రు మండల మెకానిక్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామాంజ నేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా జరిగిన మండల సంఘం సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని రంగాల కు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తుందని అదేవిధంగా తమను కూడా అసంఘటిత కార్మికులుగా గుర్తించి గుర్తింపు కార్డులు అందించాలని కోరారు. మంత్రి నారా లోకేష్ చేసిన యువగలం పాదయాత్రలో మెకానిక్ లకు న్యాయం చేస్తానని ఇచ్చినమాట నెరవేర్చాలని గుర్తు చేశారు. ప్రతి సభ్యునికి ఆరోగ్య భద్రత కల్పించి ఆర్థికంగా ఎదిగేందుకు సహాయం మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకునేందుకు బి6 మెకానిజాన్ని ప్రభుత్వం తరఫున నేర్పించే ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెకానిక్ల సంఘం మండల కార్యదర్శి పి.నాగ దుర్గాప్రసాద్,ట్రెజరర్ గంగాధర్ సభ్యులు ఎర్రం శెట్టి గణేష్,మణికంఠ పాల్గొన్నారు.

పోలీసు ఆయుధాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో శనివారం జిల్లా పోలీసు కార్యాలయ పోలీస్ పెరేడ్ మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు పోలీసులు శాంతిభద్రతలు కాపాడటానికి, సంఘవిద్రోహశక్తులను నిరోధించడానికి వినియోగించే అత్యాదునిక ఆయుధాలు, ఏ కె-47, మెషిన్ గన్లు, రివాల్వర్లు పిస్టల్ లు, గ్రేనేడ్లు, టియర్ గ్యాస్ షెల్, వైర్ లెస్ సెట్, డిహెచ్ఎండి, హెచ్ హెచ్ఎండి, బాంబు డిస్పోజల్ సిబ్బంది వినియోగించే పరికరాలు, నేరం జరిగినప్పుడు క్లూస్ టీం ఏ విధంగా ఆధారాలు సేకరించేది మొదలగు వాటి పని తీరు గురించి విద్యార్థిని, విద్యార్థులకు జిల్లా ఎస్పీ వి.విద్యా సాగర్ నాయుడు స్వయంగా వివరించారు. కొన్ని ఆయుధాలను ఎస్పీ స్వయంగా టార్గెట్ పై ఉపయోగించి అవి ఎలా పని చేస్తాయి, వాటితో జనసమూహం అధికంగా గుమిగూడినప్పుడు ఏ విధంగా చెదరగొట్టవచ్చు అనే విషయాలు విద్యార్థులకు తెలిసేలా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వివి నాయుడు , అడిషనల్ ఎస్పీ ఏ ఆర్ సత్యనారాయణ , బందరు డిఎస్పి సిహెచ్ రాజా , పట్టణ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు,ఎస్ఐలు, ఆర్ ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత ఆక్రందన

ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం చెబుతున్న మాటలకు చేతలకు పొంతన ఉండటం లేదు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టపోయిన అన్నదాతకు ఊరట కలిగించాల్సిన ప్రభుత్వం ఓదార్పు మాటలకే పరిమితమవుతోంది. తాజాగా మొంథా తుపానుకు దెబ్బతిన్న వరికి పరిహారం చెల్లింపుకు కొత్త కొత్త నిబంధనలు తీసుకురావడం ఆందోళనకు గురిచేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలకు తోడు ప్రభుత్వ విధానాలు రైతన్నలను కుదేలు చేస్తున్నాయి.

ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట నెల రోజుల్లో చేతికంది వస్తుందనగా అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో మొంథా తుపాను విరుచుకుపడింది. దీని దాటాకి కృష్ణా జిల్లాలో 1,11,295.12 ఎకరాల్లోని వరి పంట నేలవాలిపోయింది. సాధారణ పరిస్థితుల్లో సగటున ఎకరాకు 33 బస్తాలు (బస్తా 75 కిలోలు) ధాన్యం దిగుబడి వస్తుంది. నేలవాలడంతో కనిష్టంగా ఎకరాకు 10 బస్తాలకు నుండి గరిష్టంగా 20 బస్తాలకు దిగుబడి పడిపోతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నూర్పిడి పూర్తయ్యేనాటికి ఎకరా వరికి అన్నదాత రూ.42 వేలు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. తుపాను దెబ్బకు పెట్టిన పెట్టుబడిలో సగం ఎకరాకు రూ.21 వేలు చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.

ప్రకృతి వైపరీత్యాలు వాటిల్లిన సందర్భాల్లో ప్రభుత్వం పంటల బీమా, పరిహారం నష్టపోయిన రైతులకు ఒకింత ఊరట ఇస్తున్నాయి. ఈ ఏడాది పంటల బీమా చెల్లింపును ప్రభుత్వం నిలిపివేసింది. బీమా ప్రీమియం రైతులే చెల్లించుకోవాలని చెప్పింది. జిల్లాలో కొద్ది మంది రైతులు మాత్రమే బీమా ప్రీమియం చెల్లించారు. తుఫానుకు నష్టపోయిన రైతుల్లో అత్యధికులకు బీమా అందే పరిస్థితి లేకుండా పోయింది. ప్రకృతి వైపరీత్యాలకుదెబ్బతిన్న వరి పంటకు ఎకరాకు రూ. 10 వేలు ప్రభుత్వ పరిహారం చెల్లించాలి. నిబంధనలను సడలించి నేలవాలి దెబ్బతిన్న ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు ప్రభుత్వం సేకరించి రైతులకు ఊరట ఇవ్వాల్సి ఉంది. రైతులను ఆదుకుంటామని చెబుతున్న కూటమి నాయకులు పరిహారం చెల్లించిన భూముల్లో పండిన ధాన్యాన్ని సేకరణ కేంద్రాల్లో రైతులు అమ్ముకునే అవకాశం నిబంధనలు తీసుకు వచ్చింది.

మల్లవల్లి పారిశ్రామిక పార్కులో రూ. 100 కోట్ల మూల ధన విలువ కలిగిన ఆధునిక సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్(సిపిసి)ను ఏడాదికి రూ. 50 లక్షలకు లూలూ అనుబంధ సంస్థకు లీజుకు ఇచ్చింది. విశాఖలో కార్పొరేట్ సంస్థలు ఏర్పాటుచేసే డేటా సెంటర్‌లకు 22 వేల కోట్ల వరకు రాయితీలు ఇస్తోంది. మరోపక్క పంటల బీమా ప్రీమియం చెల్లింపు నిలిపివేసింది. పంటల సాగుకు అవసరమైన యూరియా కోటాను తగ్గించి రైతులను అష్టకష్టాల పాలు చేసింది. తాజాగా తుపానుకు దెబ్బతిన్న అన్నదాతలకు పరిహారం చెల్లింపుకు ధాన్యం సేకరణతో మెలికపెట్టింది. కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన అన్నదాతను ఆదుకోవడానికి నిబంధనలు పెట్టడం ఆందోళన కలిగిస్తోంది.

డిఎస్ఆర్‌వి ప్రసాద్

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు మైలవరం విద్యార్థులు




ప్రజాశక్తి-మైలవరం : జాతీయ స్థాయిలో నిర్వహించే అఖిల భారతీయ విశ్వ విద్యాలయాల మహిళా, పురుషుల ఫెన్సింగ్ పోటీలకు స్థానిక లకిరెడ్డి హనీమీ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇల్లా రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ పరిధిలో నిర్వహించిన కృష్ణ యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఫినిషింగ్ పోటీలలో తమ కళాశాల నుంచి పాల్గొన్న క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు ఏడుగురు ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 2 నుండి 10 వ తేదీ వరకు పంజాబ్, అమత్సర్లలో నిర్వహించే అఖిలభారత పెన్సింగ్ పోటీలలో బాలురు 5, బాలికలు 2 పాల్గొంటార న్నారు. జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన వీరిని అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

మాక్ అసెంబ్లీకి విద్యార్థి ఎంపిక



ప్రజాశక్తి-వత్సవాయి : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సచివాలయలో నిర్వహించే మాక్ అసెంబ్లీకి విద్యార్థుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. ఇందులో భాగంగా వత్సవాయి మండలంలో నియోజకవర్గ స్థాయిలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యం.జె.పి గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న నకిరికంటి వెంకటేష్ మొదటి బహుమతి సాధించారు. సదరు విద్యార్థి ఈ నెల 24న రాష్ట్ర సచివాలయంలో నిర్వహించే మాక్ అసెంబ్లీలో పాల్గొనేందుకు ఎంపిక చేసినట్లు విద్యాశాఖ అధికారి నాగరాజు తెలిపారు.

పింఛన్లు పంపిణీ



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో 25వ వార్డు క్రిస్టియన్ పేటలో అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందజేశారు. అదేవిధంగా రామ మరియాదాసుకు నూతనంగా మంజూరైన డయాలసిస్ పెన్షన్ రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, 25వ వార్డు కౌన్సిలర్ కర్ల శాంతకుమారి, కర్ల జోజి, ముత్యాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేషనల్ అర్బన్ కాన్‌క్లేవ్‌కు ఆహ్వానం



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణ మున్సిపల్ చైర్మన్ ఆర్.రాఘవేంద్ర భారత ప్రభుత్వం గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న గ్రాంట్లు, వినియోగంపై నేషనల్ అర్బన్ కాన్‌క్లేవ్ 2025లో పాల్గొనడానికి ఆహ్వానించ బడ్డారు. కాన్‌క్లేవ్ ఈ నెల 8, 9 తేదీల్లో న్యూ ఢిల్లీలో జరగనుంది. “ షోటబుల్ అర్బన్ డెవలప్మెంట్ అండ్ గవర్నమెంట్ గవర్నన్స్” అనే ప్రధాన అంశంపై దేశవ్యాప్తంగా ఉన్న మేయర్లు, చైర్మన్‌లు అధికారుల మధ్య చర్చలు జరగనున్న ఈ కాన్‌క్లేవ్‌లో రాఘవేంద్ర తమ అభిప్రాయాలను పంచుకోబోతున్నారు. ఈ ఆహ్వానం జగ్గయ్యపేట మునిసిపాలిటీ అభివృద్ధికి ఆయన చూపిన కృషి, నాయకత్వానికి గుర్తింపుగా నిలిచింది.

ఎఐతో విద్యార్థుల భవితకు బంగారుబాట

- పిబి సిద్ధార్థలో కంప్యూటర్ వర్క్‌షాప్



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు సాంకేతికతతో మమేకం కానిదే భవిష్యత్ లేదని కాగ్నిజెంట్ సంస్థ (బెంగళూరు) అసోసియేట్ డైరెక్టర్ సుభాష్ జె.వి అన్నారు. విజయవాడ పి.బి.సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కంప్యూటర్ విభాగం శనివారం కళాశాల వెబినార్ హాలులో జనరేటివ్ ఎఐ, ప్రాంప్ట్ ఇంజనీరింగ్ అంశాలపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ ప్రపంచాన్ని కంప్యూటర్ ప్రోగ్రామింగ్ శాసిస్తోందని, ప్రాంప్ట్ ఇంజనీరింగ్ దీనిని శక్తిమంతం చేస్తోందని, మరోవైపు జనరేటివ్ ఏఐ సమాచార విశ్లేషణకు దోహదపడుతోందని, సృజనాత్మకత, ఉత్పాదకతలను పెంపొందించడంలో ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేశ్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, ఐ.క్యూ.ఏ.సి. కోఆర్డినేటర్ డా.ఎస్.బి.రాజేంద్రప్రసాద్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా. టి.ఎస్.రవి కిరణ్, డిప్యూటీ హెడ్ కోనేరు శ్రీధర్, ప్లేస్ మెంట్ అధికారి కావూరు శ్రీధర్, సహాయాచార్యులు సమ్రాట్ కష్ణ, ఎం.ఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎం.సి.ఏ విద్యార్థులు పాల్గొన్నారు.

కుటుంబ కథా చిత్రం ‘సంతాన ప్రాప్తిరస్తు’



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నేటి సమాజంలో యంగ్ కపుల్స్ ఎదుర్కొంటున్న ఓ తీవ్రమైన సమస్య నేపథ్యంలో చిత్రీకరించిన సినిమా ‘సంతాన ప్రాప్తిరస్తు’ చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించి విజయవంతం చేయాలని హీరో విక్రాంత్ హీరోయిన్ చాందిని చౌదరి కోరారు. ఈ నెల 14 వ తేదీన చిత్రం విడుదల కానుందని కుటుంబ సమేతంగా చిత్రాన్ని వీక్షించవచ్చని అన్నారు. బందరు రోడ్డులోని గేట్ వే హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో విక్రాంత్ మాట్లాడుతూ సంతాన ప్రాప్తిరస్తు చిత్రంలో ఒక చక్కని ప్రేమ కథతో పాటు పెళ్లి తర్వాత్ భార్య భర్తల మధ్య పిల్లలు విషయంలో జరిగే సన్నివేశాలు ఆద్యంతం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయనీ అన్నారు. స్పెర్మ్ కౌంట్ సమస్యతో బాధపడే సన్నివేశాలను దర్శకుడు చాలా వినోదాత్మకంగా చిత్రీకరించారన్నారు. తాను విజయవాడ వాసినని, ఇక్కడే చదువుకుని, అసిస్టెంట్ డైరెక్టర్‌గా సినీ పరిశ్రమ లో అడుగుపెట్టినట్లు చెప్పారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి చెప్పిన కథ నచ్చి ఈ సినిమాలో హీరోగా నటించినట్లు తెలిపారు. నవంబర్ 14వ తేదీన ఈ సినిమా విడుదల కానందుని ప్రేక్షకులు తమ చిత్రాన్ని వీక్షించి విజయవంతం చేయాలని కోరారు. చిత్ర దర్శకుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక కాలంలో సాఫ్ట్వేర్ ఉద్యోగాలు చేసే వారితోపాటు మిగతా రంగాలలో ఉన్న యువత స్పెర్మ్ కౌంట్ సమస్యతో బాధపడుతున్నారని, ఈ సమస్యను ఒక వినోద భరితంలో సినిమా ద్వారా ప్రేక్షకులకు తెలియజేస్తున్నామన్నారు. సంతాన ప్రాప్తిరస్తు చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

ఎన్‌టిఆర్ భరోసాతో పేదలకు సామాజిక భద్రత

- కలెక్టర్ జి.లక్ష్మీశ



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : పేదలు సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు దోహదం చేస్తున్నాయని.. జిల్లాలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. విజయవాడ అర్బన్ పరిధిలోని ఖుద్దూస్ నగర్ - కేదారేశ్వరపేట ప్రాంతంలో సామాజిక భద్రత పింఛన్లను అధికారులతో కలిసి కలెక్టర్ పంపణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్ల మొత్తాన్ని లబ్ధిదారుల ఇళ్లవద్దే అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌డీవోలు, మునిసిపల్ కమిషనర్లు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు కూడా పెన్షన్ల పంపిణీ ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో సామాజిక భద్రత పెన్షన్ల ద్వారా 2,29,393 మంది లబిద్దారులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వివిధ క్యాటగిరీల పెన్షన్లకు సంబంధించి రూ. 99 కోట్ల 43 లక్షల మొత్తాన్ని లబ్దిదారులకు అందజేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, యూసీడీ పీవో పి.వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం : ఎంపి

ప్రజాశక్తి- నందిగామ : తుఫానుతో పంట నష్టపోయి ఆందోళనలో ఉన్న ప్రతి రైతును ఆదుకుంటామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. నందిగామ మండలం పల్లగిరి, కమ్మవారి పాలెం, రాఘవపురం, చందాపురం, కేతవీరుని పాడు గ్రామాల్లో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ పర్యటించారు. గ్రామాల్లో లబ్ధిదారులకు పెన్షన్లు అందజేయటంతో పాటు, తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంట పోలాలను పరిశీలించారు. సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ కుమ్మవారి పాలెంలో మీడియా మాట్లాడుతూ పంట చేతికి వచ్చే సమయానికి తుఫాన్ కారణంగా రైతులు నష్టపోవటం దురదష్టకరమన్నారు. తేమ శాతం వున్నా పత్తి పంటను కొనే విధంగా అధికారులతో మాట్లాడతామని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు.